సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



నాలుగు విడతలుగా..
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నాలుగు విడతలలో బిల్లులు ఇవ్వనున్నట్లు హౌసింగ్ అధికారులు తెలిపారు.
- 8లో ▸



సంతలో సౌకర్యాలేవి?
లింగంపేటలో సంత నిర్వహణకు సరైన స్థలం లేక, సౌకర్యాలు కరువై వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.9 /15.1

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపటి ప్రజావాణి రద్దు

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ వారం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు అందరూ ఎన్నికల విధుల్లో ఉన్నందున ప్రజావాణి నిర్వహించడం లేదని పేర్కొన్నారు. అత్యవసరంగా వినతులు ఇవ్వడం కోసం కలెక్టరేట్‌లోని 25వ నంబర్ గదిలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు.

ఉపాధ్యాయుడి రిమాండ్

గాంధారి: విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు రమేశ్‌ను పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని న్యాయమూర్తి ముందు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కాగా సదరు ఉపాధ్యాయుడిని ఇప్పటికే సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

అందరూ ఉత్తీర్ణత సాధించాలి



బీబీపేట: ఎస్సెస్సీ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా చదవాలని డీఈవో రాజు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కృత్యమేళాను ఆయన పరిశీలించారు. కాంప్లెక్స్ పరిధిలోని 19 పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు టాలెంట్ టెస్ట్, స్పెల్‌బీ రీడింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు వివిధ అంశాలకు సంబంధించిన కృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీంద్రారెడ్డి, క్వాలిటీ కో ఆర్డినేటర్ వేణుగోపాల్ శర్మ, జిల్లా సైన్స్ అధికారి సిద్దరాంరెడ్డి, మండల విద్యాధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

‘సాహిత్యాభివృద్ధికి కృషి చేశారు’



దోమకొండ: ఉర్దూ సాహిత్యాభివృద్ధికి దోమకొండ గడికోట సంస్థానధీశులు కృషి చేశారని ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ మహమ్మద్ సులేమాన్ సిద్దిఖీ పేర్కొన్నారు. శనివారం గడికోటలో ఉర్దూ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉర్దూ భాష అభివృద్ధికి నాటి సంస్థానధీశులు చేసిన కృషి, కవులు, కళాకారులను ప్రోత్సహించిన తీరును వివరించారు. ఢోలక్ కే గీత్, ఖవ్వాలి లాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గడికోట వారసులు కామినేని అనిల్‌కుమార్, ఇంటెక్ హైదరాబాద్ కన్వీనర్ అనురాధరెడ్డి, వక్తలు నిజాం అలీ, సాజిద్ సాహిద్, అర్ష జాబెన్, నిశిత్ అహ్మద్, వాహిద్ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

ఎల్లారెడ్డి: ఉమ్మడి గురుకులాల ప్రవేశ పరీక్ష (5 నుంచి 9 తరగతులు)ను ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పరీక్షల జిల్లా సమన్వయ అధికారి నాగేశ్వరరావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గాంధీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఉదయం 9 గంటలలోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

పక్కా లోకల్!

సండే స్పెషల్







చుక్కాపూర్ గ్రామం

అనగనగా ఓ ఊరు.. ఆ ఊరికో పేరు.. ఇందులో వింతేముంది, అన్ని ఊళ్లదీ ఇదే వరుస అంటారా? కానీ ఈ ఊళ్ల అసలు పేర్లు రికార్డులకే పరిమితం.. వాడుకలో ఇంకో పేరే ప్రసిద్ధం.. ఇలా జిల్లాలో చాలా ఊళ్లున్నాయి. అసలు పేరుతో కాకుండా వాడుకలో ఇంకో పేరుతో పిలుస్తున్న గ్రామాలపై సండే స్పెషల్..

ఒక ఊరు.. రెండు పేర్లు
- రికార్డుల్లో ఒకలా.. వ్యవహారంలో ఇంకోలా..
- వాడుక భాషలోనే పిలుస్తామంటున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పల్లె ఆత్మీయతల సంగమం. ఆపతి సంపతిలలో ఒకరికొకరు తోడవుతారు. కులాలు, మతాల పట్టింపులు ఉండవు. వరుసలు పెట్టుకుని పిలుచుకునే సంస్కృతి ఇప్పటికీ కొనసాగుతోంది. వారు మాట్లాడే తీరు ఆత్మీయతను చాటుతుంది. అంతే కాదు ఊళ్ల పేర్లు రికార్డులో ఎలా ఉన్నా.. వాడుక భాషలోనే వ్యవహారం సాగుతుంటుంది. ఇలా జిల్లాలో వందలాది గ్రామాల పేర్లను వాడుక భాషలో పిలుస్తుంటారు..

బీబీపేట.. బీపేట

చాలా గ్రామాల్లో తమ ఊరి పేరును సులువుగా ఉండే వాడుక భాషలోనే చెబుతుంటారు. బీబీపేట మండల కేంద్రాన్ని ఆ గ్రామస్తులే కాదు.. చుట్టుపక్కల ఊళ్లవారూ బీపేట/బీపాట అని పిలుస్తుంటా రు. ఊరిపేరు బీబీపేట కదా అంటే ''ఆ.. మేం గిట్ల నే అంటం'' అని ముఖం మీదే చెబుతారు. పాల్వంచ మండల కేంద్రాన్ని పలంచ అంటారు. ఇదే మండలంలోని ఇసాయిపేట గ్రామాన్ని ఇస్సపేట అని, ఫరీదుపేటను ఫర్దిపేట అని, అంబారిపేటను అంబ ర్పేట అని, సోమారంపేటను సోమర్పేట/సోమారీ అనీ పిలుస్తుంటారు. భవానీపేటను బాన్పేట, ఉప్పల్‌వాయిని ఉప్పలయ, ఇసన్నపల్లిని పల్లె, మోషంపూర్‌ను మోషంపురం, శేరి బీబీపేటను శేరిపల్లి, మహ్మదాపూర్‌ను మందాపూర్ అని పిలుస్తారు. కామారెడ్డిని గతంలో కామడిపేటగా పిలిచేవారు. ఇప్పటికీ పెద్దలు ఈ పేరుతోనే పిలుస్తుంటారు.

సంగోజీవాడి.. సంగజడ

తాడ్వాయి మండలంలోని సంగోజీవాడి గ్రామాన్ని సంగజడ అని, కాళోజీవాడిని కాల్జడ అని, కృష్ణాజీవాడిని కృష్ణజడ అని/కిష్టజడ, బ్రహ్మాజీవాడి గ్రామాన్ని బ్రహ్మజడ/బమ్మజడ అని, ఇస్రోజివాడిని ఇస్రజడ, పద్మాజీవాడిని పద్మజడ, తుక్కోజీవాడిని తుక్కజడ ,తిమ్మోజీవాడిని తిమ్మజడ అని పిలుస్తుంటారు. దేవాయిపల్లిని దేవుపల్లి, దేమికలాన్‌ను దేమె, కన్కల్‌ను కన్కంటి, కరడ్‌పల్లిని కరట్లపల్లి, ఎర్రాపహాడ్‌ను ఎర్రవాటి, మాచారెడ్డిని మాసన్పేట అని పిలుస్తారు.

చుక్కాపూర్.. సుక్కపురం

మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ గ్రామాన్ని ఇప్పటికీ సుక్కపురం అని పిలుస్తారు. అక్కాపూర్ గ్రామాన్ని అక్కపురం అని, లక్ష్మీరావులపల్లిని రచ్చురాలపల్లిగా, సోమారంపేటను సోమార్పేటగా, వాడి గ్రామాన్ని వాడె అని, లచ్చాపేటను లచ్చుపాట అని, బండరామేశ్వర్‌పల్లిని బంద్రాసిపల్లి, ఘన్‌పూర్‌ను గడ్డపారం అని స్థానికులు పిలుస్తుంటారు. రామారెడ్డిని రథాల రామారెడ్డి అని, ఎల్లారెడ్డిని తాలూకా ఎల్లారెడ్డి అని అంటుంటారు. రాజంపేటను దవాఖానా రాజంపేట అని, సదాశివనగర్‌ను నగురం/నగర్ అని, రాజఖాన్‌పేటను రాయికాన్‌పాట వ్యవహరిస్తుంటారు.

తిప్పాపూర్.. తిప్పరం

తిప్పాపూర్‌ను తిప్పరం అని, కాచాపూర్ గ్రామాన్ని కాసపురం/కాస్పురం అని వ్యవహరిస్తున్నారు. గండివేట్‌ను గంధ్యాటం, పొతంగల్ కలాన్‌ను పెద్ద పొతంగల్ అని, పొతంగల్ ఖుర్దును చిన్న పొతంగల్ అని, పేట్ సంగంను పెద్ద సంగం అని, మాతు సంగంను చిన్న సంగం అని పిలుస్తారు. కరక్‌వాడీ గ్రామాన్ని కరికాడ, కర్ణంగడ్డ తండాను సున్నంగండి తండా, వెల్గనూర్‌ను ఎన్గులూర్, మంగళూరును మొగులూర్, నస్రుల్లాబాద్‌ను నసర్లవాడ, బొమ్మన్‌దేవ్‌పల్లిని బొమ్మందేపల్లి అని, కామిశెట్టిపల్లిని కంశెట్పల్లి అని, నాచుపల్లిని నాచ్పల్లి అని, చిన్న కొడప్‌గల్‌ను కొడగంటి అని పిలుస్తుంటారు.

మర్కల్.. మర్కంటి

మర్కల్ అనే ఊరును మర్కంటి అని పిలుస్తారు. సంగమేశ్వర్ గ్రామాన్ని సంగనాతిపల్లె అని, శెట్పల్లి సంగారెడ్డిని సంగరెడ్డిపేట అని, పోతాయిపల్లిని పోతపల్లె అని, రామాయిపల్లిని రాంపల్లె అని, బోనాల్‌ను ఈరపేట అని, కేశాయిపేటను కేశ్పేట అని పిలుస్తుంటారు. దావల్‌మాలిక్ పల్లిని దాల్మల్కపల్లి అని, వజ్జపల్లిని అజ్జపల్లి అని, జనగాం నుంచి జొనగామ అని, కుప్రియాల్‌ను కుప్రాల అని, గోపన్‌పల్లిని గొంపల్లి అని, శాంతాపూర్‌ను శాంతపురం అని, లింగాపూర్‌ను లింగపురం అని, ఉగ్రవాయిని ఉగ్రాయ అని, బ్రాహ్మణపల్లిని బామండ్ల పల్లె అని పిలుస్తున్నారు.

అందరు సుక్కపురమే అంటరు



మా ఊరు పేరు చానా మంది సుక్కపురం అంటరు. పాతకాలం వాళ్లయితే ఇప్పటికీ సుక్కపురమే అంటుంటరు. సుక్కపురం పలకడానికి అలుకగ ఉంటది.
– ఐలయ్య, చుక్కాపూర్‌వాసి

కృష్ణజడ అనే అంటం



మా ఊరి పేరు కృష్ణాజీవాడి. కానీ తాతల కాలం నుంచి కృష్ణజడ అని, కిష్టజడ అనే పిలుస్తున్నరు. చదువుకున్న వాళ్లు కొందరు కృష్ణాజీవాడి అని పిలుస్తారు.
– రాజయ్య, కృష్ణాజీవాడివాసి

ఫరీదుపేట అంటే తెలియదు



ఎవరైనా ఊరు పేరు అడిగితే ఫర్దిపేట అనే అంటం. ఇది పలకడానికి సులువుగా ఉంటుంది. పెద్దమనుషులకు చాలా మందికి ఫరీదుపేట అంటే తెలియదు.
–రవిగౌడ్, ఫరీదుపేటవాసి

ఇప్పుడు బీఆర్‌పల్లి అంటున్నరు



మా ఊరు పేరు బండరామేశ్వర్పల్లి. అందరూ బండరామేశంపల్లి అని, బంద్రాసిపల్లి అనే పిలుస్తరు. కొత్త తరం వాళ్లు బండరామేశ్వర్‌పల్లి అని, బీఆర్‌పల్లి అని అంటున్నరు.
–అంజి, బండరామేశ్వర్‌పల్లివాసి

ఎన్నికల సిబ్బంది సకాలంలో చేరుకోవాలి

- విధులకు హాజరు కాకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవు
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కేటాయించిన సిబ్బంది సకాలంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకుని ఎన్నికల సామగ్రి పొందాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసిడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది, జోనల్ అధికారులకు రెండో దశ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులకు హాజరుకాని సిబ్బందిపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. పోలింగ్ సిబ్బందికి ఏవైనా సందేహాలు, సమస్యలు, ఇబ్బందులూ ఉంటే శిక్షణ సమయంలో నివృత్తి చేసుకోవాలన్నారు. మాస్టర్ శిక్షకులు ఎన్నికల విధులకు సంబంధించిన పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీవో సురేందర్, డీపీవో శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారంలో ప్రబలిన విష జ్వరాలు

- మంచం పట్టిన గ్రామస్తులు
- వైద్య శిబిరం ఏర్పాటు

నిజాంసాగర్(జుక్కల్): బిచ్కుంద మండలంలోని ఎల్లారం గ్రామంలో విషజ్వరాలు ప్రబలాయి. జ్వరాలతో ప్రజలు మంచం పడుతున్నారు. వారం రోజులనుంచి గ్రామస్తులు చికున్‌గున్యా, ఇతర విష జ్వరాలతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు వైద్య ఆరోగ్య శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో వైద్యాధికారులు గ్రామంలో శనివారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శనివారం 65 మందికి రక్త పరీక్షలు చేశారు. 15 మందికి చికున్ గున్యా ఉన్నట్లు గుర్తించామని వైద్యులు తెలిపారు. మిగతా వారు విష జ్వరాలతో బాధపడుతున్నారని, అందరికీ అవసరమైన మందులు అందించామని పేర్కొన్నారు.



పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

రంజాన్ కోసం ఏర్పాట్లు చేయండి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ పరంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ ఉపవాస దీక్షలు వచ్చేనెల 2వ తేదీనుంచి ప్రారంభం కానున్నాయన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నమాజ్ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలన్నారు. అదనంగా పాలు, వంటగ్యాస్ అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అదనపు కోటా చక్కెర సరఫరా చేయాలని పౌర సరఫరాల అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు యంత్రాంగం మసీదుల వద్ద శాంతి భద్రతలను పర్యవేక్షిస్తుందని ఎస్పీ సింధు శర్మ తెలిపారు. తెల్లవారు జామున ప్రార్థన సమయానికి ముందే నీటిని సరఫరా చేయాలని ముస్లిం మతపెద్దలు కోరారు. మసీదుల వద్ద షేడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలని, పండుగ సామగ్రి కొనుగోలు చేయడానికి రాత్రి వేళల్లో దుకాణాలు అందుబాటులో ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఏఎస్పీ చైతన్యరెడ్డి, అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- రాష్ట్ర బాగుకోసం బీజేపీని గెలిపించాలి
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కామారెడ్డి టౌన్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కావడం లేదన్నారు. 25 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేసి, 56 వేల ఉద్యోగాలిచ్చినట్లు గొప్ప లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కేంద్రం ఆ దాయపు పన్ను మినహాయింపు పరిమితి పెంచడంతో ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలకు మేలు జరిగిందన్నారు. రాష్ట్ర ప్రజలు, అన్ని వర్గాలు బాగు పడాలంటే బీజేపీనే గెలిపించాలని కోరారు.

కామారెడ్డి జిల్లాపై ప్రేమ ఎక్కువ

గతంలో తాను పాదయాత్ర చేసిన సమయంలో ఇక్కడి ప్రజలు జోష్ నింపారని బండి సంజయ్ పేర్కొన్నారు. అందుకే కామారెడ్డి అంటే తనకు ప్రేమ ఎక్కువన్నారు. బీజేపీ పాదయాత్ర వార్నింగ్‌తో ఉద్యోగులకు సమయానికి జీతాలు వేశారన్నారు. 317 జీవో, ఉద్యోగుల సమస్యలు, పీఆర్సీ, డీఏ, ఫీజురీయింబర్స్‌మెంట్ తదితర అంశాలపై పోరాటం చేశామని గుర్తు చేశారు. ఈ క్రమంలో తనపై 109 కేసులు నమోదు చేశారని, తమ కార్యకర్తలను జైలుకు పంపారని పేర్కొన్నారు. అప్పుడు టీఎన్జీవోలు, ఉపాధ్యాయ సంఘాలు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పత్తాలేరన్నారు.

రిటైర్మెంట్ వయసు పెంచేందుకు..

రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో డబ్బులు లేకపోవడంతో ఉద్యోగుల రిటైర్మెంట్ వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచేందుకు సీఎం సిద్ధమవుతున్నారని బండి సంజయ్ ఆరోపించారు. ఎల్‌ఆర్‌ఎస్ పేరిట ప్రజల నుంచి రూ. 50 వేల కోట్లను దోచుకోవాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నారాజ్‌గా ఉన్నారని, నియోజక వర్గాలకు నిధులు లేక అభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. టాప్ 5 మంత్రులకు మాత్రమే న్యాయం జరుగుతోందని, 15 శాతం కమీషన్‌లు తీసుకుంటూ బిల్లులు చెల్లిస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వాపోతున్నారని పేర్కొన్నారు. తమ పార్టీ ఉద్యోగులు, నిరుద్యోగుల పక్షాన ఉంటుందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, మాజీ ఎంపీ బీబీ పాటిల్, పార్టీ నాయకులు నేరెళ్ల ఆంజనేయులు, మురళీధర్‌గౌడ్, ప్రభాకర్, బాణాల లక్ష్మారెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, అరుణతార, జయశ్రీ, రాంరెడ్డి, పైడి ఎల్లారెడ్డి, హైమారెడ్డి, రాజేశ్వర్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండి సంజయ్, వేదికపై కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్, మాజీ ఎంపీ బీబీ పాటిల్

క్లుప్తంగా

సైన్స్ ప్రదర్శనలతో నైపుణ్యం పెంపొందుతుంది

- జిల్లా విద్యాధికారి రాజు



పెద్దమల్లారెడ్డిలో విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న డీఈవో రాజు

భిక్కనూరు: సైన్స్ పరిశోధనలతో విద్యార్థులో నైపుణ్యం పెంపొందుతుందని జిల్లా విద్యాధికారి రాజు అన్నారు. శనివారం మండలంలోని పెద్దమల్లారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు పరిశోధనలతో పేరుప్రఖ్యాతులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారెడ్డి, ఎంఎస్‌వో శ్రీనాథ్, హెచ్‌ఎం ప్రసునాదేవి, వేణుశర్మ, ఎన్‌ఎస్‌సీ అధికారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్ల కోసం..



ఓ ఇంటి ఎదుట బైఠాయించిన మున్సిపల్ అధికారులు, బిల్ కలెక్టర్లు

కామారెడ్డి టౌన్: ఆస్తి పన్ను చెల్లించకపోతే ఆస్తులు, సామగ్రి జప్తు చేస్తామన్నా మొండి బకాయిదారులు స్పందించడం లేదు. దీంతో బల్దియా అధికారులు టార్గెట్ చేరుకోవడానికి వినూత్నంగా ముందుకు సాగుతున్నారు. జిల్లా కేంద్రంలోని 24వ వార్డులో ఓ ఇంటి యజమాని చాలా ఏళ్లుగా ఆస్తి పన్ను చెల్లించడం లేదు. మున్సిపల్ రెవెన్యూ అధికారి రవిగోపాల్ బిల్ కలెక్టర్లతో కలిసి శనివారం ఆ ఇంటికి వెళ్లి బైఠాయించారు. పన్నులు చెల్లించే వరకు కదిలేది లేదంటూ మొండికేశారు. మొదట్లో ఆ ఇంటి యజమాని వాదనకు దిగినా.. చివరకు రూ. 11 వేల ఆస్తి పన్ను బకాయిని చెల్లించాడు. సకాలంలో పన్ను చెల్లించి బల్దియా అభివృద్ధికి సహకరించాలని ఆర్‌వో కోరారు. లేకపోతే ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామానికి చెందిన చెవిటి రేవతి, ఆమె ఇద్దరు పిల్లలు అదృశ్యమైనట్లు ఎస్సై వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఈ నెల 20వ తేదీన రేవతి తన ఇద్దరు పిల్లలను తీసుకొని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు.కుటుంబసభ్యుల, బంధువుల ఇండ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. రేవతి భర్త చెవిటి రంజిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రేపు ఇసుక వేలం

మాచారెడ్డి : మండలంలోని లచ్చాపేట శివారు వాగు వద్ద ఈ నెల 21న సీజ్ చేసిన పది ట్రాక్టర్ల ఇసుకను ఈ నెల 24న వేలం వేయనున్నట్లు తహసీల్దార్ శ్వేత ఒక ప్రటకనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు రూ.పదివేలు ధరావతు చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు.

కట్టిపడేసే ఇంద్రజాలం

- మెజీషియన్‌గా రాణిస్తున్న సంతోష్
- నేడు అంతర్జాతీయ మెజీషియన్ దినోత్సవం



కామారెడ్డి తొలి ఎస్పీ శ్వేతా ముందర ఇంద్రజాల ప్రదర్శన నిర్వహిస్తున్న సంతోష్ (ఫైల్)

భిక్కనూరు: ఇంద్రజాల విద్యను నేర్చకొని అందరిని మనసులను కట్టిపడేస్తున్నాడు భిక్కనూరు మండల కంచర్ల గ్రామానికి చెందిన కుమ్మరి సంతోష్. ఇంటర్ చదువుతుండగా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఏడాదిపాటు మంచంపైనే ఉన్నప్పటికి ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా ఇంద్రజాల విద్య నేర్చుకున్నాడు. తన ప్రదర్శనలతో అవార్డులు ప్రశంసలు పొందుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.. గాయపడినప్పుడే టీవీలో మెజీషియన్ సామల వేణు షోలను చూసి ఇంద్రజాలకుడిగా మారాలని నిశ్చయించుకున్నాడు. సామల వేణు వద్దకు వెళ్లి శిష్యరికం చేసి మేజిక్‌లో ట్రిక్స్ నేర్చుకున్నాడు. నోటి నుంచి లింగాల తియ్యడం, ఖాళీ గ్లాసుల నుంచి నీటిని రప్పించడం, నిమ్మకాయల నుంచి రక్తంను చూపించడం ఖాళీ చేతులతో విభూతి సృష్టించడం మూఢ నమ్మకాలను పారద్రోలేందుకు గ్రామాల్లో స్వచ్ఛందంగా ప్రదర్శలను నిర్వహిస్తున్నాడు. అప్పటి కామారెడ్డి కలెక్టర్ సత్యనారాయణ, ఎస్పీ శ్వేతాల ముందు తన ఇంద్రజాలాన్ని ప్రదర్శించాడు. దీంతో కలెక్టర్ సత్యనారాయణ సంతోష్‌ను ఉత్తమ మేజీషియన్‌గా గుర్తించి 2017 తెలంగాణ సంబురాల్లో అవార్డును అందజేశాడు. కళ్లకు గంతలు కట్టుకుని రోడ్డుపై ద్విచక్రవాహనాన్ని పలుమార్లు నడిపి ప్రశంసలు పొందాడు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు సంస్థలు నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని అవార్డులు, ప్రశంసలు పొందాడు. సంపాదనలో పదిశాతం సేవ కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నాను.

సేవ కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నా

ఫంక్షన్‌లలో ప్రదర్శనలు నిర్వహించినప్పుడు వచ్చే సంపాదనలో పది శాతం డబ్బులను సేవ కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నాను.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇంద్రజాల ప్రదర్శనలను నిర్వహించి వారికి తర్ఫీదును ఇస్తున్నాను.

– కుమ్మరి సంతోష్, మెజీషియన్

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీ పంపిణీ



పెద్దమల్లారెడ్డిలో విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న మెజీషియన్ సంతోష్

భిక్కనూరు : మండలంలని పెద్దమల్లారెడ్డి, కంచర్ల గ్రామాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కంచర్ల గ్రామానికి చెందిన మెజీషియన్ సంతోష్ శనివారం రూ. 28వేల విలువ చేసే పరీక్ష ప్యాడ్లను,నోటు పుస్తకాలను,స్టేషనరీని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం అంతర్జాతీయ మేజీషియన్ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమంను నిర్వహించామన్నారు ఈకార్యక్రమంలో భిక్కనూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వామి, పెద్దమల్లారెడ్డి విండో చైర్మన్ రాజాగౌడ్, హెచ్‌ఎంలు, మమత, ప్రసూనదేవి, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

లోక కల్యాణార్థమే మహారుద్రాభిషేకం

- హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతీస్వామి
- కేదారేశ్వర ఆశ్రమంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



మహారుద్రాభిషేకం చేస్తున్న విద్యారణ్య భారతి స్వామి, మంగిరాములు మహరాజ్

నందిపేట్: లోక కల్యాణార్థం పరమశివునికి మహారుద్రాభిషేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హంపీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి పేర్కొన్నారు. నందిపేట మండల కేంద్ర సమీపంలోని శ్రీ కేదారేశ్వర ఆశ్రమంలో శివరాత్రి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ సమక్షంలో హంపీ పీఠాధిపతి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారుచేసిన మట్టి లింగానికి పాంచాహ్నిక దీక్ష విధానంలో లక్షా పదహారు రుద్రాక్షలకు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా హంపీ పీఠాధిపతి ప్రసంగిస్తూ పరమశివుడు అభిషేకం ద్వారా ప్రసన్నుడై సమస్త జగత్తులకు కావాల్సిన శుభాలను అనుగ్రహిస్తాడని తెలిపారు. ఈ నెల 27 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. శివరాత్రి రోజు ఆశ్రమంలో లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు యువతులపై లైంగికదాడికి యత్నం!

- మద్యం తాగించిన యువకులు
- తప్పించుకొని రోడ్డుపైకి వచ్చిన యువతి
- పోలీసుల అదుపులో యువకుడు

ఖలీల్‌వాడి: ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామ శివారులోని నర్సింహస్వామి దేవాలయం గుట్ట సమీపంలోని అటవీ ప్రాంతంలో నగరానికి చెందిన ఇద్దరు యువతులకు మద్యం తాగించి లైంగికదాడికి యత్నించినట్లు తెలిసింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. నిజామాబాద్ నగరానికి చెందిన ఇద్దరు యువతులను దుబ్బాక పరిసర తండాలకు చెందిన నలుగురు యువకులు కారులో తీసుకొచ్చారు. వీరంతా కలిసి అటవీ ప్రాంతంలో మద్యం సేవించారు. అనంతరం మత్తులో ఉన్న ఇద్దరు యువతులపై లైంగికదాడికి యత్నించగా ఓ యువతి తప్పించుకొని రోడ్డుపైకి వచ్చింది. ఓ వాహనాదారుడు కనిపించడంతో విషయం చెప్పగా.. ఆ యువతిని దుబ్బాకకు తీసుకెళ్లి వివరాలు తెలుసుకున్నారు. గ్రామస్తులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లగా వారిని చూసి ముగ్గురు యువకులు పరారైనట్లు తెలిసింది. కాగా, ఓ యువకుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. యువతుల నుంచి పోలీసులు స్టేట్‌మెంట్ తీసుకొని నిజామాబాద్ పంపించినట్లు తెలిసింది.

'సోషల్ వర్క్ చేస్తూ స్వయం ఉపాధి పొందాలి'

కామారెడ్డి అర్బన్: యువత సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ స్వయం ఉపాధి వైపు ఎలా వెళ్లాలనే అంశంపై భిక్కనూర్ సౌత్ క్యాంపస్‌లో నిర్వహించిన రెండురోజుల జాతీయ సెమినార్ నిర్వహించారు. ఇందులో తమ కళాశాల సోషల్ వర్క్ విద్యార్థులు పాల్గొని వివిధ అంశాలు నేర్చుకున్నారని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. సోషల్ వర్క్ డిగ్రీ పూర్తి కాగానే ఉపాధి వైపు వెళ్లేలా సెమినార్ బాగా ఉపయోగపడిందని విద్యార్థులు పేర్కొన్నారన్నారు. సెమినార్‌లో పాల్గొని ధ్రువీకరణ పత్రాలను అందుకున్న విద్యార్థులను శనివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందిచారు. సోషల్ వర్క్ విభాగం హెచ్‌వోడీ శ్రీనివాస్‌రావు, అధ్యాపకులున్నారు.

క్రైం కార్నర్

జ్యూస్ అనుకొని పురుగుల మందు తాగిన చిన్నారులు

- వాంతులు చేసుకోవడంతో ఆస్పత్రికి తరలించిన తల్లిదండ్రులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంజన

రామారెడ్డి: చిన్నారులు ఇద్దరు ఆడుకుంటూ వెళ్లి పంట పొలాలకు వినియోగించే పురుగుల మందు సేవించిన ఘటన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం స్కూల్ తండాలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గంగావత్ సంజన (10), గంగావత్ బిందు (7) అక్కాచెల్లెళ్లు. శనివారం తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లడంతో ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారులు పానీయం అనుకుని ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగారు. కాసేపటికే ఇంటికి వచ్చిన తల్లిదండ్రుల ముందు ఇద్దరు వాంతులు చేసుకున్నారు. గమనించిన తండ్రి గంగావతి మంత్ ఏమైందని పెద్ద కూతురును ప్రశ్నించగా తాము తాగిన డబ్బాను చూపించింది. ఏడేళ్ల బిందుకు మాటలు రావు. వెంటనే 108 కు కాల్ చేసి కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చిన్నారులను తరలించారు. చిన్నకూతురు బిందు పరిస్థితి విషమంగా ఉందని తండా వాసులు తెలిపారు. స్కూల్ తండా ప్రాథమిక పాఠశాలలో సంజన 6వ తరగతి చదువుతోంది.

పెళ్లికి వెళ్లి వచ్చేసరికి దోచేశారు

ఖలీల్‌వాడి: పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగిన ఘటన నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హబీబ్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన కథనం ప్రకారం.. మహ్మద్ మోసిన్ కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి తాళం వేసి మహారాష్ట్రలోని బంధువుల పెళ్లి వెళ్లారు. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న సుమారు నాలుగు తులాల బంగారం, 300 గ్రాముల వెండి, నగదును ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కారు బోల్తా.. ఆరుగురికి తీవ్రగాయాలు

భిక్కనూరు: మండల కేంద్ర సమీపంలో శనివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరుకు చెందిన ఆరుగురు వ్యక్తులు కుంభమేళా నుంచి కారులో తిరిగివస్తుండగా భిక్కనూరు వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురుకి గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి 108 సిబ్బంది ఈఎంటీ యాదగిరి, పైలట్ స్వామి చేరుకొని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి కామారెడ్డికి తరలించారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

- బాన్సువాడ యువకుడి మృతి
- వీధిన పడిన కుటుంబం



నక్క సందీప్(ఫైల్)

బాన్సువాడ : తల్లిదండ్రులతోపాటు భార్యాపిల్లలకు జీవితాంతం తోడుగా ఉండాల్సిన ఆ యువకుడిని రోడ్డు ప్రమాదం కబళించింది. బాన్సువాడ పట్టణానికి చెందిన నక్క సందీప్ (30) శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని మేడిపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి తహసీల్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం రాత్రి తాను ఉంటున్న గదికి వెళ్లే క్రమంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో సందీప్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఏడాదిన్నర కుమార్తె, ఏడు నెలల కుమారుడు ఉన్నాడు. తండ్రి గంగారాంకు కళ్లు సరిగా కనిపించవు. తల్లి మొగులవ్వ వృద్ధురాలు. సందీప్ మరణంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. కాగా, గతంలో బాన్సువాడ వీఆర్‌ఏగా పని చేసిన సందీప్‌ను బదిలీల సమయంలో మేడిపల్లికి రికార్డు అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. సందీప్ మరణవార్త విని బాన్సువాడ, మేడిపల్లిలోని అధికారులు, వీఆర్‌ఏలు శోకసంద్రంలో మునిగారు.

చోరీ కేసులో ఇద్దరు రిమాండ్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని సంగోజివాడి గ్రామంలో ఇటీవల దొంగనానికి పాల్పడిన ఇద్దరు దొంగలను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. సంగోజివాడికి చెందిన దోమకొండ అనిల్, గడ్డం బాలరాజు అనే ఇద్దరు వ్యక్తులు ఈనెల 17, 18తేదీల్లో అదే గ్రామానికి చెందిన గడ్డం రాజవ్వ, గంట రాజశేఖర్, గడ్డం సత్యవ్వ ఇంట్లో చొరబడి చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టి అనిల్, బాలరాజులను శనివారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి 7గ్రాముల బంగారం, 10తులాల వెండి, 300ల నగదు, ఒక సౌండ్‌బాక్స్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఎల్లారెడ్డిలో ఒకరు..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడిన నిందితుడిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. మెదక్ పట్టణానికి చెందిన జ్ఞానసింగ్, మరో ఇద్దరు గుజరాతీ వ్యక్తులు గతేడాది డిసెంబర్ 16న మండలంలోని దేవునిపల్లి కొట్టాల గ్రామాల్లో అర్ధరాత్రి తాళాలు వేసి ఉన్న ఇండ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు జ్ఞానసింగ్‌ను పట్టుకొని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. నిందితుడి నుంచి 50 తులాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నాలుగు విడతలుగా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు

హౌసింగ్ డీఈ సుభాష్



ఎల్లారంలో అవగాహన కల్పిస్తున్న డీఈ సుభాష్

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నాలుగు విడతలుగా బిల్లులు ఇవ్వనున్నట్లు హౌసింగ్ డీఈ సుభాష్ వెల్లడించారు. శనివారం ఆయన లింగంపేట మండలం ఎల్లారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఇల్లు కట్టుకునే వారికి బేస్‌మెంట్‌కు రూ. లక్ష, గోడలు కట్టిన తర్వాత రూ. లక్ష , స్లాబ్ వేసిన తర్వాత రూ. 2 లక్షలు, ఇల్లు పూర్తయిన తర్వాత రూ.లక్ష పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తామన్నారు. పాత ఇళ్లకు డబ్బులు ఇవ్వడం జరుగదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎటువంటి అవకతవకలకు తావులేదన్నారు. ముందుగా ప్రభుత్వం మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్టుగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. త్వరలో మండలంలోని అన్ని గ్రామాలకు ఇల్లు మంజూరావుతాయన్నారు. ఇల్లు మంజూరైన వారు తప్పనిసరిగా ఇల్లు నిర్మించుకుంటేనే బిల్లులు ఖాతాల్లో జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, కార్యదర్శి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా సేవలందించాలి



ముగింపు సమావేశం అనంతరం ఆపద మిత్రలతో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్

నిజామాబాద్‌అర్బన్: విపత్తుల సమయంలో ఆపద మిత్రలు సమర్థవంతంగా సేవలందించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని న్యాక్ భవనంలో శనివారం ఆపద మిత్రల మొదటి విడత శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మరో రెండు దఫాలుగా శిక్షణ అందించి, సుశిక్షితులైన సైనికుల వలే తర్ఫీదునిస్తామన్నారు. తొలి విడత శిక్షణ పూర్తి చేసుకున్న వాలంటీర్లకు త్వరలోనే గుర్తింపు కార్డు, సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు. మిగతా రెండు దఫాల శిక్షణ కూడా పూర్తి చేసుకున్న వారికి ఐదు లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని వర్తింపజేస్తారని, సుమారు రూ.10వేల విలువ చేసే విపత్తు నివారణ సహాయ ఉపకరణాలతో కూడిన కిట్ అందజేస్తారని పేర్కొన్నారు. 300 మంది వాలంటీర్లను మూడు బ్యాచ్‌లుగా విభజించి 19 రోజులపాటు వివిధ శాఖల నిపుణులు, స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రయోగాత్మక శిక్షణ అందించారు. విపత్తుల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

మాయ కాదు.. అంతా మ్యాజిక్

- మూఢ నమ్మకాలపై ప్రజల్లో చైతన్యం
- వినోదం, విజ్ఞానాన్ని పంచుతున్న మెజీషియన్లు
- నేడు ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం

మోర్తాడ్(బాల్కొండ): కళ్లు మూసి తెరిచేలోపు కళ్లకు కలిగే భ్రమే ఇంద్రజాలం. గ్లాసులో ఉన్న పాలు తగ్గిపోవడం, ఎన్నిసార్లు తాగిన పాలు గ్లాసు నిండుగానే ఉండటం, నోట్ల వాన కురిపించడం లాంటివి ఎన్నో మ్యాజిక్‌తో సాధ్యమవుతున్నాయి. మూఢ నమ్మకాలతో తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్న వారికి సరైన అవగాహన కల్పించడం, పిల్లలకు వినోదం పంచుతూ విజ్ఞానం అందించడం ఇంద్రజాలికుల ప్రధాన లక్ష్యం. మాయా లేదు, మంత్రం లేదు అంతా మ్యాజికే అంటున్నారు మెజీషియన్‌లు. మంత్రాలు, క్షుద్రపూజలు నమ్మే వారి రుగ్మతను దూరం చేసే కళ మ్యాజిక్‌కే దక్కింది. సమాజాన్ని మేలుకొలిపే దిశగా మెజీషియన్లు తమవంతు కృషి చేస్తున్నారు. నేడు ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

నిజామాబాద్ పట్టాభిరామ్‌గా రంగనాథ్...



నేటితరానికి తెలిసిన ఇంద్రజాలికులలో ప్రథముడు పీసీ సర్కార్(సీనియర్), తెలుగునాట ఈ మ్యాజిక్ కళను పరిచయం చేసింది బీవీ పట్టాభిరాం. నిజామాబాద్ పట్టాభిరామ్‌గా కీర్తీ ప్రతిష్టలను ఆర్జిస్తున్నారు జాదు యుగంధర్ రంగనాథ్. రెండు దశాబ్దాలుగా మెజీషియన్‌గా అనేక ప్రదర్శలను ఇచ్చి అందరినీ అలరిస్తూ సమాజాన్ని చైతన్య పరిచేందుకు తనవంతు కృషి చేస్తున్నారు. పీసీ సర్కార్(సీనియర్) జయంతిని పురస్కరించుకొని ఈ నెల 27న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న పీసీ సర్కార్ పురస్కారానికి రంగనాథ్ ఎంపికయ్యారు.

మెజీషియన్లను ప్రోత్సహించాలి



మ్యాజిక్ కళను నమ్ముకున్న వారిని ప్రభుత్వం ప్రోత్సహించాలి. మ్యాజిక్ అనేది విజ్ఞానంతో కూడిన కళ. వర్సిటీల్లో కోర్సును కొనసాగిస్తుండటమే ఇందుకు నిదర్శనం.

– చందన శ్రీనివాస్, నిజామాబాద్

అందరి సహకారంతో ప్రదర్శనలు



అందరి సహకారంతో ప్రదర్శలను ఇస్తున్నాం. మ్యాజిక్‌ను వినోదం కోసం కాదు విజ్ఞాన దృష్టితో చూడాలి. ప్రజలను చైతన్యపరచడం కోసం మావంతు కృషి చేస్తున్నాం.

– జాదు యుగంధర్ రంగనాథ్, ఆర్మూర్

హైడ్రోక్లోరైడ్ ట్యాంకర్ బోల్తా

- యాసిడ్ లీక్‌తో ఇబ్బందులు
- వాహనాల దారి మళ్లింపు



ట్యాంకర్‌పై నీళ్లు చల్లుతున్న అగ్నిమాపక సిబ్బంది

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నాగ్‌పూర్ గేట్ సమీపంలో 44వ నెంబరు జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం హైడ్రోక్లోరైడ్ కెమికల్‌ను రవాణా చేస్తున్న ట్యాంకర్ బోల్తాపడింది. ట్యాంకర్ నుంచి హైడ్రోక్లోరైడ్ కెమికల్ లీకేజీ కావడంతో ఘాటైన వాసన పీల్చుకొని స్థానికులు, వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. సమాచారం తెలుసుకున్న డిచ్‌పల్లి ఇన్‌చార్జి సీఐ భిక్షపతి, ఎస్సై ఎండీ షరీఫ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే వాహనాలను సీఎంసీ మీదుగా దారి మళ్లించారు. తహసీల్దార్ ప్రభాకర్, ఆర్‌ఐ సంతోష్ చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. జిల్లా కేంద్రం నుంచి అగ్నిమాపక శకటాన్ని తెప్పించి ట్యాంకర్ నుంచి లీకైన కెమికల్ ద్వారా ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు. మరో ట్యాంకర్‌ను రప్పించి బోల్తాపడిన ట్యాంకర్ నుంచి హైడ్రోక్లోరైడ్ కెమికల్‌ను నింపారు. ప్రమాదంలో గాయపడిన ట్యాంకర్ డ్రైవర్ ముఖేష్‌ను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం, అజాగ్రత్తే కారణమని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నాగిరెడ్డిపేటలో నివాసపు గుడిసె దగ్ధం



అగ్నిప్రమాదంలో దగ్ధమయిన నివాసపు గుడిసె

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామంలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు నివాసపు గుడిసె దగ్ధమైంది. గ్రామంలోని పుల్ల మణెమ్మ తన సోదరి పద్మతో కలిసి నివాసపు గుడిసెలో నిద్రించగా ఆకస్మాత్తుగా పెద్దశబ్దం రావడంతో భయంతో బయటకు పరుగులు తీశారు. గుడిసెకు మంటలు అంటుకోవడంతో స్థానికుల సహాయంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఫైరింజన్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. అగ్ని ప్రమాదంతో బీరువాలో దాచిన రూ.6లక్షల నగదు, తులం బంగారం, 16తులాల వెండిపట్టీలు తదితర సామగ్రి కాలిబూడిదయ్యాయి. నాగిరెడ్డిపేట డీటీ రాజేశ్వర్, జూనియర్ అసిస్టెంట్ సాయిలు శనివారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అడ్లూర్ సబ్‌స్టేషన్‌లో అగ్ని ప్రమాదం



కెపాసిటర్ బ్యాంక్‌లో చెలరేగిన మంటలు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ సబ్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ ఉపకేంద్రంలోని కెపాసిటర్ బ్యాంక్ విభాగంలో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన సిబ్బంది సరఫరా నిలిపివేశారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. కెపాసిటర్ బ్యాంక్‌లోని సెల్స్ పేలడంతోనే ప్రమాదం జరిగినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ప్రమాద తీవ్రత తక్కువగా ఉండటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.